నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com
1

ప్రజల వినతులు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ పీ.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులతో మమేకమై వారి సమస్య లను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కషి చేయాలని, ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం వహించరాదన్నారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదు పరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వ హించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 60 వినతులను అదనపు కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కష్ణవేణి లతో కలిసి స్వీకరించారు. వినతుల్లో 28 రెవెన్యూ శాఖకు, 4 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్, 3 డీసీ ఎస్ఓ, 3 డీపీఓ, 2 డీ ఆర్డిఓ, 3 వ్యవసా య శాఖ, 4వైద్య ఆరోగ్య శాఖ, 4 జిల్లా ఉపాధి కార్యాలయం, 2 డీడబ్ల్యుఓ, ఎటునాగారం ఐటీడీఏ, ఎల్డీఎం, డీసీఓ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఆరోగ్య శ్రీ, జిల్లా పరిశ్రమల శాఖలకు ఒకటి చొప్పున దరఖాస్తు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో డీపీవో కల్పన, డీఈవో వాసంతి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సుబేదారి



వేసవి కాలం దష్ట్యా ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర అధికారులతో వేసవికాలంలో తాగునీటి గురించి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్య ఎక్కువ ఉందని వాటి మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మసాగర్, వడ్డేపల్లి, కేయూ ఫిల్టర్ బెడ్ల నుండి తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని, ఆ ఫిల్టర్ బెడ్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తం చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు రాకుండా ప్రతి రోజు అధికారులు సమీక్షించాలన్నారు. నయిూమ్‌నగర్ నాలా అభివృద్ధి పనులు జరిగేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా దారి మళ్ళింపునకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలన్నారు.

ఈ సందర్భంగా రానున్న రంజాన్ పండుగ, సాగునీటి కి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డిసీపీ ఎంఎ బారీ, ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబ శివరావు, మైనార్టీ వెల్ఫేర్ డిడి మేన శ్రీను, జీడబ్ల్యూఎంసి ఎస్ఈ ప్రదీప్ చంద్ర, కృష్ణారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకన్న, ఈఈ రాజయ్య, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్, ఇరిగేషన్ అధికారులు ఆంజనేయులు, హర్షవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 63 వినతులు

నవతెలంగాణ-వరంగల్



ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బల్దియాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్ 12, హెల్త్, సానిటేషన్ 4, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) 15, టౌన్ ప్లానింగ్ 32, మొత్తం 63 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సెక్రెటరీ విజయలక్ష్మి, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీసీపీ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

నవతెలంగాణ-గీసుగొండ



ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆర్మీ జవాన్ మృతిచెందిన సంఘటన మండలంలోని ఊకల్ హవేలీ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బాబులాల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మణుగూరు గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాస్ (36) జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన శ్రీనివాస్ తన భార్య భవానితో కలిసి సంగెం మండలంలోని చింతలపల్లి గ్రామానికి బంధువుల ఇంటికివెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఊకల్ హవేలీ గ్రామ చివర మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌ను ఢీకొంది. ఈ ఘనటనలో శ్రీనివాస్ తల, ఛాతిలో బలమైన గాయాలు, భవానికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద ఘటనను చూసిన ఊకల్ హవేలీకి చెందిన కోటి అనే యువకుడు భవాని మేనమామ చింతల రాజుకు సమాచారం అందించాడు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న రాజు 108లో క్షతగాత్రులిద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్సపొందుతూ ఆర్మీజవాన్‌శ్రీనివాస్ మృతి చెందాడు.

మృతుడి సోదరుడు చల్లాకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధితురాలికి సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-గీసుగొండ



మహానగర పరిధిలోని 16వ డివిజన్ పోతురాజుపల్లికి చెందిన ఊగ రాణి రెండు నెలల క్రితం తనఫోనుపోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ను కనుక్కొని బాధితురాలు రాణికి సోమవారం అందజేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

నేడు ఉచిత షుగర్ వైద్య శిబిరాలు

నవతెలంగాణ-కాశిబుగ్గ

నగరంలోని సంరక్ష సూ పర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆ ధ్వర్యంలో నేడు ఉచిత డయా బెటిక్ క్యాంపులు నిర్వహిస్తున్న ట్లు హాస్పటల్ చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్ కుమార్ తెలిపా రు. సోమవారం సంరక్ష హా స్పిటల్‌లో ఉచిత వైద్య శిబిర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నేడు నగరంలో 21చోట్ల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఇందులో షుగర్, బిపి, ఫిజీషియన్, ఉచిత కన్సల్టేషన్‌తో పాటు అవసరమైన ఈసీజీ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ వైస్ చైర్మన్ డాక్టర్ కాసర్ల తిరుపతిరెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డీ శ్రావణ్ కుమార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ మొహమ్మద్, డైరెక్టర్లు డాక్టర్ లక్ష్మీదీపక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మేఘన, డాక్టర్ శ్రావ్యరెడ్డి, డాక్టర్ హరీష్, డాక్టర్ పోలానటరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఎంపీపీ శుభాకాంక్షలు

నవతెలంగాణ-పర్వతగిరి

పర్వతగిరి నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మాలోతు శంకర్‌ను సోమవారం ఎంపీపీ లునావత్ కమల మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పీటీసీ పంతులు నాయక్, గోరుగుట్ట తండా, ఏ బీ తండాల మాజీసర్పంచ్‌లు బానోతు వెంకన్న నాయక్, మాలొతు ప్రమీల గోపి నాయక్, ఉప సర్పంచ్ శ్యామల వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

అలాగే ఇస్లావత్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, యూత్ అధ్యక్షులు భూక్య భాస్కర్ నాయకులు మూడు వెంకన్న, ఇస్లావత్ వెంకన్నలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ పాలకులు రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి







నవతెలంగాణ-హనుమకొండ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానా లను విడనాడాలని సంయుక్త కిసాన్ మోర్చ డిమాండ్ చేసింది. సోమవారం హనుమకొండలోని కాలోజీ విగ్రహం వద్ద కేంద్రంలో బీజేపీ రాష్ట్రాల్లో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఎస్‌కేఎం పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లాలోని రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఈ రాస్తారోకోని ఉద్దేశించి ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, జి.రాములు, ఎస్.హంసారెడ్డిలు ప్రసంగిస్తూ దేశానికి అన్నంపెట్టే రైతులపై అమానుషమైన దాడులు, దౌర్జన్యాలు, భాష్పవాయుపు గోళాలు ప్రయోగం, తుపాకీ తూటాలతో ఇప్పటికే శుభకరంసింగ్, అనుబాసింగ్ అని ఇద్దరు రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్ళీ భారత దేశ ప్రధాని మోడీ మూడోసారి అధికారంలోకి వస్తే ఈ దేశంలో రైతాంగ హక్కులు ఉండవని, కార్మికులు, కర్షకులు, ఉపాధి హామీ కూలీలు రోడ్డున పడతారని, యువతను నిరుద్యోగులుగా మార్చేవిధానాలను అవలంభిస్తు న్నారన్నారు. మరోవైపు ఈ దేశంలో ఉన్నటువంటి శ్రామికులు కష్టపడుతున్నటువంటి సమిష్టి సంపదను, సహజ వనరులను, ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు ప్రధాని నరేంద్రమోడీ కట్టబెడుతూ వస్తున్నారన్నారు. అంతేకాక కార్పొరేట్ శక్తులు తాము తీసుకున్నటువంటి అప్పులు తిరిగి చెల్లిం చలేదని నరేంద్ర మోడీ పరిపాలన కాలంలో సుమారు రూ.14 లక్షల కోట్లు మొండిబకాయలని రద్దు చేయడం దారుణమన్నారు. మరోవైపు రైతుల కార్మికులు ఉపాధి కూలీలు నిరుద్యోగ యువకుల నోళ్లు కొడుతూ నరేంద్ర మోడీ తప్పుడు విధానాలు ఈ దేశాన్ని సర్వనాశనం చేస్తున్నాయని అన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు ప్రజల సొమ్మును దోచిపెట్టడమే నరేంద్ర మోడీ విధానాలని రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఓడిస్తేనే పేదప్రజలకు, రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.

దేశంలో ప్రజాస్వామ్యం వలన రావాలంటే ఖచ్చితంగా బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీ.వీరన్ననాయక్, గొడుగు వెంకట్, కాడబోయిన లింగయ్య, దోగ్గిల తిరుపతి, భానునాయక్, వీఎస్.రావు, గడ్డం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచి పెడుతూ రైతులను, కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించందన్నారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన మూడు నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని దేశ రాజధాని డిల్లీలో రైతులు చేపట్టిన చారిత్రాత్మక పోరాటం ఫలితంగా కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. కార్మిక చట్టాలను మార్చారని, చివరకు వామపక్షాల ఒత్తిడివల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించి ఈజీఎస్ ను కూడా నీరు గార్చే ప్రభుత్వం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలపై పెను భారం మోపే విధంగా నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి కార్పొరేట్లకు, పెట్టు బడి దారులకు లక్షల కోట్ల రాయితీలు కల్పించారని అన్నారు. ఇలాంటి ప్రజా, రైతుల, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, మారుపాక అనిల్, నెట్టం నారాయణ, పొట్లపాక రవి, బాషబోయిన సంతోష్, మెట్టు శ్యామ్ సుందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, కొంగల రామ్ చంద్రారెడ్డి, మనోహర్, రమేష్ ,దేవా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

కాశిబుగ్గ : ఢిల్లీలో రైతులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా వామపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతులపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరఅందేవిధంగా పార్లమెంటులో మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసా య రంగాన్ని విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా దేశ పౌరులంతా సంయుక్తంగా పోరాడి రైతాంగానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని లౌకికతత్వాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ సంపద మొత్తం కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందన్నారు. కార్పొరేట్లను తరిమికొట్టి దేశ సంపదను పేదలకు పంచాలన్నారు మోడీ తన అధికారకాంక్షతో దేశ సంపదను ఎలా దోచుకోవాలని చూస్తున్నారని అన్నారు. ఉత్పత్తిని సృష్టిస్తున్న 70శాతం రైతాంగ జీవితం అల్లకోలమవుతుంద న్నారు. రైతన్న ఆదుకోవడానికి ప్రణాళికే లేదని ఎద్దేవా చేశారు.

కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాచర్ల బాలరాజు, కోరబోయిన కుమారస్వామి, జగదీష్, సుదిమల్ల భాస్కర్, శంకరయ్య కార్మిక సంఘాల నాయకులు ముక్కెర రామస్వామి గన్నారపు రమేష్ మొహమ్మద్ బషీర్, నరసింహ రాములు, సదానందం, విజయ్, నజీర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎం వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించిన డీఎల్‌పీఓ



నవతెలంగాణ-ఖానాపురం

మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, రాగంపేట గ్రామాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద మంజూరు కాబడి పూర్తి స్థాయిలో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను క్షేతస్థాయిలో సోమవారం వరంగల్ డీఎల్‌పీవో కె.వేదవతి పరిశీలించారు. గతంలో అన్ని గ్రామాలకు ఎస్‌బీఎం కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కాగా లబ్ధిదారులకు రావలసిన బిల్లులు పెండింగ్ లో ఉండిపోయాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్మాణం పూర్తి అయిన మరుగుదొడ్లను ప్రత్యేకఆప్ ద్వారా అప్లోడ్ చేసి సంబంధిత లబ్ధిదారులకు బిల్లులు అందించాలని ఆదేశించడంతో సోమవారం డీఎల్‌పీవో గ్రామాలను సందర్శించి మరుగుదొడ్లను యాప్ నందు ఫోటో తీసి అప్లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవోపసరగొండ రవి, పంచాయతీ కార్యదర్శులు సట్ల సుప్రజ, దోమల రజిత, వరుణ్, ఆఫీస్ సబార్డినేట్ షఫీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

మార్చి 3 నుండి మూడు రోజుల పాటు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సరోజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీడీవో గోవిందరావు అధ్యక్షతన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్చి 3న ఆదివారం మండలంలోని 34 గ్రామాలలో 36 కేటాయించిన బూత్ లో అప్పుడే పుట్టిన పిల్లల నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పని సరిగా వాక్సిన్ వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రత్నమాల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నవతెలంగాణ-పర్వతగిరి

విద్యార్థులు కష్టపడి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇన్ఫర్ ప్రతినిధులు ఆకాంక్షించారు. మండలం లోని రోళ్ళకల్ ఆర్‌డిఎఫ్ పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్ఫర్ నిధులతో నిర్మించిన డయాస్‌ను వారు ప్రారంభించి అదనపు తరగతుల కోసం నిధిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫ ర్ ప్రతినిధులు ఫ్రాంక్, రూఢీ, రంగా, వివిధ దేశాల ప్రతినిధులు, ఆర్‌డిఎఫ్‌కార్యదర్శి అడ్డాల కిరణ్, హెచ్ఎం భాషబోయిన రాములు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండల పరిధిలోని పాపయ్యపేట జెడ్‌పిహెచ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి మోహ్రీ సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్ రావు, ఎస్ఎంసీ చైర్మన్ జాటోతు యాకుబ్, కొత్తపెల్లి కష్ణ, బండి రాజు, ఉపాధ్యాయులు ప్రతాప్, రవీందర్, నరసింహస్వామి, చంద్రకళ, ప్రతిమ, వెంకటరమణ, అటెండర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన ఏసీపీఎస్ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కాశిబుగ్గ



వరంగల్ జిల్లా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేశా రు. సోమవారం ఏవీవీ కళాశాల లో దేవ అరవింద్ బాబు అధ్యక్షతన ఏర్పా టుచేసిన ప్రమాణ స్వీకార కార్యక్ర మానికి ఏసీపీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దె ప్రేమ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు బొద్దుకూరి కిరణ్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చందా జగదీశ్వర్, గాదె వాసుదేవ్ కోశాధికారి సిహెచ్ నాగరాజులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం తమ వంతు కషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిమల్ల శ్రీనివాస్ రావు, జిల్లా గౌరవ అధ్యక్షులు భువనగిరి రాజన్న, సంయుక్త కార్యదర్శి నూతన కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రమేష్, గుండా రాము, దార పూర్ణ, కార్యదర్శులు వాసుదేవ్, వెంకటేశ్వర్లు, రమేష్, ముఖ్య సలహాదారులు గుండ సంతోష్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు యేలగందుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం

నవతెలంగాణ-నర్సంపేట



బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని నర్సంపేట మున్సిపాలిటీలోని 9 మంది కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని తెలిపారు. పార్టీని పట్టణంలో బలోపేతంచేయడంలో తాము క్రియాశీలకంగా పనిచేస్తామ న్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పట్టణాభివద్ధి చేస్తా మన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు అధ్యక్షులు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి ,నాగిశెట్టి పద్మ ప్రసాద్, గంప సునీత రఘునాథ్, రుద్ర ఓం మల్లీశ్వరీ ప్రకాష్, వేల్పుగొండ పద్మ రాజు, దేవోజు తిరుమల సదానందం, గందె రజిత చంద్రమౌళి, రామసాయం శ్రీదేవి సుధాకర్ రెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- పర్వతగిరి ఎంపీడీవో ఎం.శంకర్

నవతెలంగాణ-పర్వతగిరి



వేసవి సమీపిస్తున్న దృష్ట్యా ప్రజలకు మంచి నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.శంకర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో మంచినీటి ఎద్దడి నివారణపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ క్షేత్రసహాయకులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. బోర్‌వెల్స్, మోటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, లీకేజీలను మరమ్మతు చేయాలని సూచించారు. ఉపాధిహామీ పనులకు ప్రతీ గ్రామం నుండి 100 మందికి తగ్గకుండా కూలీలు హాజరయ్యేలా క్షేత్రసహాయకులు శ్రమశక్తి సంఘాలను చైతన్యవంతం చేయాలన్నారు. పని ప్రదేశంలో మంచినీటి వసతి, షెడ్‌నెట్ వేసి వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపిఓ సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
మంగళవారం | ఫిబ్రవరి 27, 2024 | www.navatelangana.com

క్రీడా గ్రామాలుగా తీర్చిదిద్దుతా : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-ఎల్కతుర్తి

గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు గ్రామాలను క్రీడాప్రాంగణాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు స్నేహానికి, సంతోషానికి, శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ పడతాయని ఈ ప్రాంతాన్ని క్రీడా రంగంలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. యువతను ప్రోత్సహించడానికి ఎల్కతుర్తి వద్ద టోర్నమెంట్ ఏర్పాటు చేసిన నాయకులకు, అధికారులను అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొనగా చిగురుమామిడి మండలం రేగొండ గ్రామానికి చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రూ.30 వేలు నగదు, మెమొంటో, రెండవ స్థానంలో నిలిచిన ఎల్కతుర్తి సీనియర్ జట్టుకు రూ.15 వేల నగదు, మెమొంటో, జూనియర్ జట్టుకు రూ.10వేలు మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షు లు సుఖిన సంతాజి, అశోక్ రెడ్డి, గోలి రాజేశ్వరరావు, కాజీపేట ఏసీపీ తిరుమళ్, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై గోదారి రాజకుమార్, సాయిబాబా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణంతో నెరవేరిన ప్రజల కోరిక : ఎమ్మెల్యే కేఆర్





- **వర్చువల్‌గా పలు రైల్వే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**

నవతెలంగాణ-కాజీపేట

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమత్ భారత్ పథకంలో భాగంగా దేశంలో 41 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో 156 వంతెనలు, ఆర్ఓబి బ్రిడ్జిల నిర్మాణాలు, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ ల ప్రారంభ కార్యక్రమాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఆన్లైన్ పద్ధతిలో ప్రారంభించడం జరిగింది,వడ్డేపల్లి నిరుప్ తండ నుండి వరంగల్ ఓఆర్‌ను కలుపుకుంటూ వడ్డేపల్లి రైల్వే గేటు మీద నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా సోమవారం రైల్వే ఉన్నత అధికారులు ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు హాజరై ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైల్వే స్టేషన్ల పునరుద్దీకరణ అభివద్ధి పనులలో భాగంగా వడ్డేపల్లి రైలు పట్టాల మీదుగా 40 కోట్ల నిధులతో నూతన బ్రిడ్జి నిర్మించడం సంతోషంగా ఉందని, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు రైల్వే గేటు కష్టాలు తప్పయన్నారు. స్థానిక ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని, గతంలో తాను కేయుసి పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నప్పుడు వడ్డేపల్లితండా ప్రాంతాలకు రావాలంటే ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం పెరుగుతున్న రద్దీతోపాటు ప్రజలకు రైల్వే గేటు సమస్యలు ఏర్పడకుండా కేంద్ర ప్రభుత్వం నూతన బ్రిడ్జిలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు, రెండున్నరేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారని అందుకు రైల్వే ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రతి విద్యార్థి అంబేద్కర్ ఆశయ సాధన కొరకు కృషి చేసి ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం రైల్వే డిప్యూటీ సీఈఈ సాగర్ మాట్లాడుతూ అమత్ భారత్ పథకంలో భాగంగా దేశప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టా త్మకంగా రైల్వేస్టేషన్లో పునరుద్ధీకరణ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారని, అందులో భాగంగా కాజీపేట హసన్పర్తి రైల్వే స్టేషన్లను కలుపుతూ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు, కాజీపేట-బల్లార్షా సెక్షన్ల మధ్య రైళ్ల రద్దీ అధికమవడంతో, రద్దీ తగ్గించడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి అత్యవసర ప్రయాణాలు, ట్రాన్స్పోర్ట్ ను సులభతరం చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ లో పునరుద్ధరీకరణ, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ ల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆన్లైన్ ద్వారా ప్రధాని సందేశం సందేశం అనంతరం ప్రారంభ కార్యక్రమం సోమవారం కాజీపేట డీజిల్, ఎలక్ట్రికల్ లోగో షెడ్ సమీపంలో నిర్మించిన పనుల వద్ద నిర్వహించగా ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు 62వ డివిజన్ జక్కుల రవీందర్ యాదవ్, 63 విజయశ్రీ రజాలి, 45 ఇండ్ల నాగేశ్వరరావు, సీనియర్ డిఎంఈ అంకేశ్వరపు స్వరాజ్‌కుమార్ హాజరై ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ అమత్ భారత్ పథకంలో భాగంగా 554 రైల్వే స్టేషన్ ల పునాభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ లు నిర్మాణం చేపట్టి ప్రారంభించడం అభినందనీయమన్నారు, కాజీపేట ప్రజల 40 ఏళ్ల కలఅయినా రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే స్టేషన్ ను డివిజన్ గా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించని అధికారులు

- **డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి**



నవతెలంగాణ-సుబేదారి

సమస్యలను పరిష్కరించాలని ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని, అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు అందజేసినా చర్యలు శూన్యమన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి ప్రజలు సమస్యలు విన్నవించుకుంటుంటే ఏ మేరకు పరిష్కారమవుతున్నాయో అని సందేహం వ్యక్తం చేశారు. వినతి పత్రాలు తీసుకోవడం తప్ప వాటికి మాత్రం పరిష్కరించడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన స్పందించాలని చెబుతుంటే ఇక్కడ మాత్రం దానికి విరుద్ధంగా ఉందని అన్నారు. వినతిపత్రాలు తీసుకోవడం తప్ప వాటికి మాత్రం పరిష్కారం చూపెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు సమస్యల మీద ఇచ్చిన వినతి పత్రాలపై స్పందించాలని అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి వినతి పత్రంలో కలెక్టర్ ను కోరారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

- **మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితరామకృష్ణ**



నవతెలంగాణ-పరకాల

మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదఅనితరామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని భూపాలపల్లి రోడ్డు లోని చలివాగు పంప్ హౌస్, ట్రాన్స్‌ఫార్మర్, నూతనంగా నిర్మిస్తున్న స్మశాన వాటికల పనులను మున్సిప ల్ పాలకవర్గం అధికారులతో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశానవాటికల పనులను త్వరగా పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పంప్ హౌస్ మోటార్లను పరిశీ లించి అందుకు తగిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నా రు. మున్సిపల్ అభివద్ధిలో ప్రతి వార్డు అభివద్ధికి పాలకవర్గం తో అధికార యంత్రాంగం బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగూరి జైపాల్ రెడ్డి, కమిషనర్ నరసింహ, ఏఈ వంశీ, విద్యుత్ శాఖ అధికారులు, కౌన్సిలర్ సారయ్య కో-ఆప్షన్ నెంబర్ షబ్బీర్ అలీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలాం ప్రతిభయోగ్యత పరీక్షకు విశేష స్పందన

నవతెలంగాణ-కాజీపేట

హైదరాబాద్ ఈ అభ్యాస్ అకాడమి తెలుగు రాష్ట్రాలలో 3 నుండి పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే 10 వ అంతర్ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ప్రతిభ యోగ్యత పరీక్షలకు విశేష స్పందన లభిస్తుందని సంస్థ సిఇఓ డాక్టర్ ఫణి పవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేటలోని విజేత హై స్కూల్ నందు పలు పాఠశాలలో చెందిన 66 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించామని, అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఏప్రిల్ 13న హైదరాబాద్ లోని భారతీయ విద్యా భవన్ లో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

అనంతరం విజేత పాఠశాల డైరెక్టర్ బండి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలలో పరీక్ష నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్ఐని సస్పెండ్ చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-కమలాపూర్



కమలాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకో వాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రద్ధశుక్లాకు ఫిర్యాదు చేసినట్లు రిపోర్టర్ రమాకాంత్ విలేకరులకు తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ అశోక్‌రెడ్డి విలేకరులకు స్థలాలు ఇప్పిస్తానని కొద్ది మంది వద్ద రూ.10 వేల నుండి రూ.30 వేల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విలేకరుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఆర్ఐ ని సస్పెండ్ చేయాలన్నారు. ఈ విషయంపై ఆర్ఐ అశోక్ రెడ్డిని వివరణ కోరగా ఏ రిపోర్టర్ వద్ద డబ్బులు తీసుకోలేదన్నారు.

ఎంపీడీవోకు ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-ఎల్కతుర్తి



ఎల్కతుర్తిలో ఎంపీడీవోగా మూడేళ్లు విధులు నిర్వర్తించిన తూర్పాటి సునీత బదిలీపై కరీంనగర్‌కు వెళ్లారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన ఎస్.విజయ కుమార్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్ కార్యదర్శులు సోమవారం ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా తూర్పాటి సునీత ఎల్కతుర్తి ప్రజలు, అధికారులు మూడు సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యుల లాగా చూసుకున్నారని ఉద్వేగ పర్యంతమయ్యారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ మేకల స్వప్న, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

అడ్మిన్ అడిషనల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన రవి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ అదనపు డీసీపీగా ఎస్. రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జోగులాంబ గద్వాల్ అడిషనల్ గా విధులు నిర్వహిస్తున్న అద నపు డీసీపీ రవి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగం అదనపు డీసీపీగా బాధ్యతలు స్వీకరించారు. 1991 పోలీస్ విభాగంలో చేరి ఎస్ఐ, సిఐగా మెదక్ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించగా, డి ఎస్పీగా సంగారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పనిచేసారు. గత ఏడాది అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు.

సీపీని మర్యాద పూర్వకంగా కల్సిన అదనపు డీసీపీ

సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ గా బాధ్యతలు చేపట్టిన రవి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు.

మేయర్ సమస్యలు పరిష్కారించాల్సిందే

- **కౌన్సిల్ హాలో కార్పొరేటర్ల రహస్య సమావేశం**

నవతెలంగాణ-వరంగల్

కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచి మూడేళ్లయినప్పటికి సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు కార్పొరేటర్లు బల్దియా కౌన్సిల్ హాల్ లో కార్పొరేటర్లు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకొని అందులో చర్చించుకున్నట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశం కంటే ముందు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని చర్చలోకి వచ్చింది. 66 డివిజన్ లోని ప్రతి డివిజన్లో ఎక్కడి సమస్య అక్కడే ఉండడం వల్ల ప్రజల మధ్యలోకి వెళ్లలేక పోతున్నామని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు కార్పొరేటర్లకు మధ్య సమన్వయం లేదని సర్వసభ్య సమావేశంలో సమస్యలు చెప్పుకునేందుకు సమయం ఇవ్వడం లేదని అంతర్గతంగా చర్చ జరిగిందని, కార్పొరేటర్ల సమ స్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు ఒక నిర్ణయా నికి వచ్చినట్లు తెలిసింది. తమ అభిప్రాయాలను ఏకీభవించనిపక్షంలో బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించాలని కార్పొరేటర్లు ఒక తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు పనిచేసేలా చూడాలి

నవతెలంగాణ-సుబేదారి

తక్షణమే ప్రభుత్వ అధికారిక వెబ్సైట్లను పని చే సేలా చూడాలని హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను స్వేరోస్ నెట్వర్క్ రాష్ట్ర నాయకులు మారపెల్లి మనోజ్ కోరారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా పాలన మరచి ప్రజాసంక్షేమమే మా పాలన అంటూ మాటలు చెబు తూ ప్రజలను ఇబ్బందుల గురిచేసిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజా అధికారుల పేర్లు, ప్రభుత్వ ఫోన్ నెంబర్లు కూడా ప్రజలకు అందుబాటులోకీ తీసుకురాలేదన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారిక వెబ్సైట్లో ఉ న్న అధికారుల పేర్లు ,ఫోన్ నెంబర్లను ప్రభుత్వ అధికారిక వెబ్సైట్లను వారి ఫోటోలు ముద్రించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దూడల సిద్ధు, అల్లూరి తిరుపతి, గుర్రం శశత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా కాట్రపల్లి-ప్రగతిసింగారం రోడ్డు

- **కంకర తేలిన రోడ్డుతో ప్రయాణీకుల ఇబ్బందులు**
- **బీటీ రోడ్డుకు మరమ్మత్తులకు ఎప్పుడో...!**
- **ప్రమాదాలబారిన పడుతున్న వాహన చోదకులు**



నవతెలంగాణ-శాయంపేట

కంకర తేలిన బిటి రోడ్డుపై నడక నరకప్రాయంగా మారింది. ఆ దారి గుండా వెళ్లే వాహన చోదకులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అయినప్పటికీ అధికారులలో చలనం శూన్యం. ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును మరమ్మతు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే. మండలంలోని కాట్రపల్లి-ప్రగతిసింగారం గ్రామాల మధ్య బీటీ రోడ్డు ని ర్మాణం చేపట్టారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీటి ప్రవాహానికి 500 మీటర్ల మేర బీటీ రోడ్డు వరదకు కొట్టుకొని పోయింది. దీంతో కంకర తేలింది. ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు కొట్టుకొని పోయి 9 నెలలు గడుస్తున్న అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, గొల్లపల్లి, రాజుపల్లి, సాధోనిపల్లి, మల్లంపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ దారిపై వెళ్లాల్సి ఉంది. ద్విచక్ర వాహనదారులు కంకర తేలిన రోడ్డుపై వాహనాలను నడపలేక తరచూ ప్రమాదాల పడుతున్నట్లు బాధితుడు సుధగాని బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి కంకర తేలిన బీటీ రోడ్డును వెంటనే అధికారులతో మరమ్మత్తు చేయించి ప్రజలకు ప్రాణాలను కాపాడాలని మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ గౌస్ కోరారు.

పాముకాటుతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-శాయంపేట

పాముకాటుతో ఓ వృద్దురాలు మృతిచెందిన సంఘటన శాయంపేట మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాయంపేటకు చెందిన దుంపల సరోజన (79) ఇంట్లో అరలోని వంటసా మాగ్రిని తీస్తున్న క్రమంలో అక్కడే ఉన్న పా ము ఆమె కుడిచేయిపై కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

అగ్రంపహాడ్ జాతర ఆదాయం రూ 60.85 లక్షలు



నవతెలంగాణ-ఆత్మకూరు

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని శ్రీ సమ్మక్క సారక్క జాతర నాలుగు రోజులు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతరలో 30లక్షల పైనే భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు. జాతరలో ఎండోమెంట్ అధికారులు 50 హుండీ లను ఏర్పాటు చేశారు. జాతర అనంతరం సోమవారం వరంగల్ బట్టల బజార్ లోని వెంకటేశ్వర ఆలయంలో ఎండోమెంట్ ఏసీ సుజాత, ఆత్మకూరు తాసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఈవో, జాతర కమిటీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది తో సమ్మక సారక్క జాతర లోని హుండీ ల లెక్కింపు చేపట్టగా హుండీ ఆదాయం రూ.42,11,018, టికెట్ల ద్వారా రూ. 11,18,365, వేలం పాట ద్వారా రూ.7 55,716 , మొత్తం జాతర ఆదాయం రూ. 60,85,100 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి జి శేషగిరి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, మాజీ ఎంపీపీ బీరం సునందా రజనీకర్ రెడ్డి, జాతర చైర్మన్ శీలం రమేష్ యాదవ్, బోరిగం స్వామి,కమిటీ సభ్యులు అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్ల అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల లోని ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్ల మండల అధ్యక్షులుగా లక్క రాజు, డివిజన్ కార్యవర్గ సభ్యులుగా పాశం మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డ్రైవర్ యూనియన్ నాయకులు ఎన్నికైన శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగవత రమేష్, టేకుల స్వామి, రఘు, అనిల్, కుమార్, సునీల్, ముప్పిడి స్వామి పాల్గొన్నారు.

విజయ సంకల్ప బస్సు యాత్ర జయప్రదం చేయాలి

ఆత్మకూరు : మార్చి 1న పరకాలలో నిర్వహించనున్న విజయసంకల్ప బస్సుయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం సోమవారం ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎదు లాపురం శ్రవణ్‌కుమార్, వంగాల బుచ్చిరెడ్డి, ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, బలవంతుల రాజు, గట్టు వేణు, రవ్వ శివప్రసాద్, ఊగ సాయి కష్ణ, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, ఎంపీటీసీ బయ్య రమరాజు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన త్రాగునీటిని అందించాలి

● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి



పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి సహకరించి శుద్ధిత త్రాగునీటిని అందించేందుకు సహకరించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ బాల వికాస డైరెక్టర్ శౌరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని బాల వికాస ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు మరువలేనివని, గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధిత త్రాగునీటిని అందించేందుకు దృష్టి పెట్టాలని కోరారు. స్పందించిన శౌరెడ్డి గ్రామాల్లో వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆర్‌జేఎస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

నవతెలంగాణ-తరిగొప్పుల



మండల కేంద్రంలోని అనాథ వృద్ధాశ్రమంలో ఆర్‌జెఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎం జాన్, జయమని జాన్‌లు హాజరయ్యారు. అనంతరం కేఎం జాన్ మాట్లాడుతూ తరిగొప్పుల వెల్ఫేర్ సొసైటీ ద్వారా గ్రామాలలోని పేద మహిళలకు మూడు నెలల పాటు కొట్టు శిక్షణ పొందిన తర్వాత ఆర్జెఎస్ ఫౌండేషన్ ఎలాన్ మేరీ ముద్దమల్లె సహాయంతో ఆర్జెఎస్ ఫౌండేషన్ ద్వారా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ఒక్కొక్క గ్రూపులో 22 మంది సభ్యులను ఎంపిక చేసి వారికి కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ ఏ.పీటర్, చర్చి అధ్యక్షుడు ఖాతా దేవదానం, దామెర జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.



భారీ యంత్రాలు, క్రషర్లతో ప్రజల ప్రాణాలకు ముప్పు..!

● యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామ సమీపాన కలిగిన విజయలక్ష్మి స్టోన్‌క్రషర్ యజమానులు బోరు బావులు వేసే భారీ యంత్రాలతో క్రషర్‌ను నడుపుతూ ఆ పిమ్మట రాళ్లను కంకరగా మార్చే క్రమంలో వచ్చే సిలికా పౌడర్‌తో గ్రామంలోని ప్రజలు అనారోగ్య పాలవుతూ గుండెపోటులకు గురవుతున్నారని, అలాగే గ్రామంలోని ఇండ్లు సైతం ధ్వంసం అవుతున్నాయని, అలాగే రైతుల పంట పొలాల్లో సైతం దుమ్ము దూళి చేరడంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయని, రైతులు వెళ్లే కెనాల్ కాల్వ ప్రాంతంలో భారీ వాహనాలు నడుపుతుండడంతో దేవాదుల సీసీ కూడా ధ్వంసం అయిందని ఇప్పటి వరకు గ్రామంలోని 36శాతం మంది అనారోగ్యం పాలయ్యారని, వెంటనే శ్రీ విజయలక్ష్మి క్రషర్ యజమానులపై సంబంధిత శాఖ అధికారులు చర్య తీసుకోవాలని గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్లో, అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ శాఖకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నిబద్ధతతో పని చేస్తుంది

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమంపై నిబద్ధతతో పనిచేస్తుందని, నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతగా పనిచేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో నియోజక వర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. మౌలిక వసతుల రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామాలను ఫార్మా విలేజిలుగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. షాట్ లైట్ టౌన్‌షిప్‌లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

నవతెలంగాణ-పాలకుర్తి



మహిళలఅభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు పని చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిల ఆదేశాల మేరకు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్‌తో కలిసి మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో మహిళలను అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీరెడ్డిలు పనిచేస్తున్నారని తెలిపారు. అర్హులైన మహిళలందరికీ చీరలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు మాదాసు హరీష్, సేవాదళ్ రాష్ట్ర కార్య దర్శి గుగ్గిళ్ళ ఆదినారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, నాయకులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో న్యూట్రిషన్ మెగా హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

మండలంలోని తిరుమలగిరిలో సోమవారం కేవక్రైపో కంపెనీ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ ఊరుకొండ శివ మాట్లాడుతూ కేవక్రైపో కంపెనీ ద్వారా ఆయుర్వేదిక్ న్యూట్రిషన్ 4గ్రాముల మ్యాగ్నెటిక్ రిసోనేస్ ఎనలైజర్ పరికరం ద్వారా మనిషి యొక్క పూర్తి బాడీ స్కాన్ చేసి న్యూట్రిషన్ లోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెలియజేస్తామని చెప్పారు. న్యూట్రిషన్ లోపాల వల్ల మోకాళ్ళ నొప్పులు, బీపి, షుగర్, లివర్, ఊపిరితిత్తుల ప్రాబ్లమ్స్, గ్యాస్ సమస్యలు, థైరాయిడ్, కిడ్నీ సంబంధిత లోపాలు, పిల్లల్లో ఎదుగుదల లోపించుట, అధిక బరువు వంటి సమస్యలు గుర్తించి తెలియపరుస్తామన్నారు. మా వద్ద అన్ని వ్యాధులకు అవసరమైన కేవక్రైపో కంపెనీ వారి ఆయుర్వేదిక్ మందులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ జి.సురేందర్, డాక్టర్ లక్ష్మణ్, సిహెచ్.అఖిల, న్యూట్రిషన్ కన్సల్టెంట్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లింగంపల్లి జాతర హుండీ ఆదాయం 7 లక్షలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

చిల్పూర్ మండలం లింగంపల్లి మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జరిగిన నాలుగు రోజుల వేదికలో హుండీల ద్వారా రూ. 7లక్షల 5 వందల ఆదాయం చేకూరింది. రద్దు చేసిన రూ. 5వందల నోట్లు, ఒక 2వేల పాతనోట్లు, చిన్న పిల్లల ఉపయోగించే ఒక రూ. 50, రూ. 20 నోటు కూడా హుండీలో పడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ కార్యక్రమంలో ఈఓ వంశీ, మాజీ సర్పంచ్ రవీందర్, బాలరాజు, అపరాధపు రాజు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రచారం చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ. అబ్బాస్

నవతెలంగాణ-జనగామ



బీజేపీ ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయడమే సీపీఎం లక్ష్యం అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ. అబ్బాస్ అన్నారు. సోమవారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి. అబ్బాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోరాడే సంస్థల పట్ల, కమ్యూనిస్టుల పట్ల దుష్ప్రచారం చేస్తూ తన మతోన్మాద, కార్పొరేట్ విధానాలను ముందుకు తీసుకెళ్లాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఈ పరిస్థితులలో ప్రజాస్వామిక వాదులు, కమ్యూనిస్టులు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. భారత దేశంలో నిరంకుశ పాలన సాగుతోందని విమర్శించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చ లేకుండా, ప్రతిపక్షపార్టీలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండానే మోడీ ప్రభుత్వం చట్టాలు చేస్తోందని ఆయన ఎండగట్టారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేసినపుడు, కొత్త లేబర్ కోడ్లు చట్టం చేసినపుడు కూడా ఇదే పద్ధతి అవలంభించారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను తొలిగించి నియంతృత్వం వైపు తీసుకెళ్తున్న బీజేపీ విధానాల ప్రమాదాన్ని అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు కనీస మద్దతు ధర కోరితే అన్నదాతలపై కాల్పులు జరపడం అమానుషం అన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.యాదగిరి, ఇ.అహల్య, ఆర్.రాజు, ఎస్.రమేష్, ఆర్.సోమన్న, జిల్లా కమిటీ సభ్యులు బి.గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఎస్.విజేందర్, పి.ఉపేందర్, బి.నరేందర్, ఎండి షబానా, పి.నాగరాజు, ఎం.రమేష్, పాల్గొన్నారు.

బీజేపీ ధమనకాండకు వ్యతిరేకంగా మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-జనగామ

ఢిల్లీలో రైతులపై మోడీ ప్రభుత్వ ధమనకాండకు నిరసనగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట రైతులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలని ఢిల్లీలో లక్షలాది మంది రైతులపై మోడీ ప్రభుత్వం కాల్పులు జరిపి ఒక రైతు మరణానికి కారణం కావడం కావడం సిగ్గుచేటన్నారు. అందుకు నిరసనగా దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, జిల్లా నాయకులు మంగళంపల్లి జనార్ధన్, నాయకులు చొప్పరి సోమయ్య, జువారి రమేష్, కావట్ యాదగిరి, రావుల సదానందం, పాతూరు ప్రశాంత్, చలోజు మల్లేశం, గుంటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

● నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు
● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బైరు శ్రీనివాస్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బైరు శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపటి మార్చి 16 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 9140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 3166 మంది విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు 1197 మంది పరీక్షలకు హాజరవుతారని. అదేవిధంగా రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు 3578 ఒకేషనల్ 118 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. జిల్లాలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. అలాగే హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, ఎగ్జామ్ ప్యాడ్‌లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతులు లేదని పేర్కొన్నారు. కేంద్రాలు సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటాయన్నారు. జిల్లాలో జనగామ మండలానికి 10, నర్మెట్ట ఒక్కటి, స్టేషన్‌ఘన్పూర్ 3, జాఫర్‌గడ్ ఒకటి, పాలకుర్తి ఒకటి చొప్పున మొత్తం 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : ఇంటర్ పరీక్షలు రేపటి నుండి ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాలు జనగామ జిల్లా కేంద్రంలో ఉన్నందున బచ్చన్నపేట మండలంలో సుమారు చాలా గ్రామాలు జనగామకు దూరంగా ఉండటం వలన జనగామ డిపో నుంచి వచ్చే బస్సులు పరీక్షల రోజుల్లో క్రమం తప్పకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జనగామ నియోజక వర్గ కిసాన్ కో ఆర్డినేటర్ జంగిటి నరేష్ డిపో మేనేజర్‌ను కోరారు.

ఎన్నికల వాహన డబ్బులు ఇవ్వడంలో దౌర్జన్యం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం తన స్వంత వాహనంను వాడుకుని కిరాయి డబ్బులు అడిగితే నానా ఇబ్బందులు పెడుతూ, తన తల్లిని, తనను సైతం ఇష్టారీతిన కులం పేరుతో దూషించారని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డిపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎర్కొన్నారు. అంజిరెడ్డి తీరుపట్ల పోలీసులు చర్యలు తీసుకోవాలని గుగులోత్ మధునాయక్ డిమాండ్ చేశారు.



నిషేధిత అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు

● ఎస్సై ఝాన్సీ

నవతెలంగాణ-చిన్నగూడూరు

నిషేధిత అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఝాన్సీ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని తుమ్మల చెరువు తండాలో నమ్మదగిన సమాచారంతో దాడులు చేపట్టగా ధారావత్ తారమ్మ వద్ద 100 లీటర్ల పానకం ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబా పట్టుకున్నారు. అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తున్నా వీరారం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీను షాపులో తనిఖీలు చేయగా 50 కిలోల నల్లబెల్లం, కిలో పట్టిక స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురు పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి వెంట పోలీస్ సిబ్బంది కిసాన్, మోహన్ ఉన్నారు.

కోతులు, కుక్కల స్వైర విహారం

● భాయందోళనలో గ్రామస్తులు
● మహిళలు, చిన్నారులు బయటికి వెళ్ళలేని పరిస్థితి

నవతెలంగాణ-చిన్నగూడూరు



ఆనాడు గ్రామాల్లో కోతులు ఆడించే వాళ్ళువస్తే గుంపులు గుంపులుగా సర్కస్‌లో కోతులను చూసేందుకు ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రజలు వచ్చేవాళ్లు. ఇప్పుడు కోతులను చూసి మహిళలు చిన్నారులు ఉస్కో అంటూ ఇళ్లల్లోకి పరుగులు తీస్తున్నారు. ప్రతి గ్రామంలో ఎక్కడ చూసిన కోతుల బీభత్సంగా మారింది. కోతులు లేని గ్రామాలు ఉన్నాయా..? అంటే ప్రజలు వింతగా వింటున్నా పరిస్థితులు ఏర్పడ్డాయి. కోతుల భయానికి పంటలే వేయకుండా పరిస్థితులు ఏర్పడ్డాయి. దానికి కారణం వ్యవసాయం చేసుకోలేని వాళ్ల మునాబకు భూమిని ఇచ్చే వాళ్ళు కానీ ఇప్పుడున్న పరిస్థితిలో కూలీ రేట్లు, పెస్టిసైడ్స్, ముఖ్యంగా కోతుల భయానికి మూనాబ చేసే వారు కూడా రాకపోవడంతో చాలా మంది వట్టి బీడు భూములుగానే ఉంచే పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ ఏ పంట వేసిన విత్తనాలు వేసిన కాడి నుండి పంట చేతి కంది ఇంటికి వచ్చేంత వరకు నిరంతరం రైతులు కోతులు భయపడే విధంగా గ్రీన్ టార్చ్ లైట్, పులి వేషధారణ బొమ్మలు, కుక్కలు మొరిగేలా రికార్డింగ్ చేసిన మైక్‌లా ద్వారా వినూత్నంగా ప్రయోగాలు చేసిన ఫలితం తక్కువే. అయిన ఆ పంట దగ్గరే ఉంటూ కొంతమంది వంతుల వారీగా ఉంటూ కోతులు రాకుండా పంటను పాడు చేయకుండా కాపాడుతున్నారు. ఈ విధంగా కోతుల భయానికి చాలావరకు చిరుధాన్యాలు లాంటి పంటలు, కూరగాయల పంటలను ఎప్పుడో మానేశారు. గత ప్రభుత్వం కోతుల నివారణ కోసం హరితహారంలో భాగంగా ఊరికి చివరలో అడవుల్లో పండ్ల రకాల చెట్లను వేసిన ఫలితం లేకపోయింది. ప్రజల్లో ఓ..



రకమైన డిమాండ్ కూడా వచ్చింది. గ్రామంలో కోతులు లేకుండా వెళ్ళగొట్టే విధంగా ఏ పార్టీ నాయకులు చేస్తారో ఆ పార్టీకే ఓట్లు వేస్తామని డిమాండ్‌ను కూడా తీసుకు వస్తున్నారు. మహిళలు ఇంటి పని బట్టలు, వంట గిన్నెలు తోముతూ కడుగుతుండగా మహిళలపై కోతులు దాడి చేస్తున్నాయి. ఒక నెలలోనే మూడు నాలుగు సార్లు కోతుల దాడికి మహిళలు గురి అయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నపిల్లలు, మహిళలు కిరాణా షాపుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నాయి. అదేవిధంగా ప్రతి గ్రామంలో కూడా కోతుల లాగే కుక్కలు కూడా విపరీతంగా ఉండడంతో మహిళలు చిన్నారులే టార్గెట్‌గా దాడికి పాల్పడుతున్నాయి. కోతుల, కుక్కల నివారణ చర్యలు చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఎనుగంటి వినయ్ గోడ్ల కొట్టం ముందు ఆటలు ఆడుతుండగా కుక్కలు దాడి చేయగా తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు.

మూడు నెలల కాలం నుండి మండల వ్యాప్తంగా కుక్కల దాడిలో 101, కోతుల దాడిలో 27 మంది. గాయపడినారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారని ఉగ్గంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి :

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పయ్యావుల మల్లయ్య



కోతుల, కుక్కల నియంత్రణ కేంద్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి వెటర్నరీ డాక్టర్లను నియమించి కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కుక్కలు రోడ్ల వెంబడే ఉంటూ ద్విచక్ర వాహనదారుల వెంబడి పడడంతో భయంతో కిందపడి ప్రమాదాలకు గురవుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. కోతుల భయానికి మిర్చి పంట తప్ప ఏ పంట వేయలేకపోతున్నారని, ఈ సారి జెమిని వైరస్ (గుబ్బ), నల్లి వైరస్ సోకడంతో ముడతతో మిర్చి పంట అంతా చనిపోయిందని, అప్పులు తీసుకొని పెట్టుబడులు పెడితే అపార నష్టం వాటిల్లిందని మల్లయ్య అన్నారు.

మంచి పనులతోనే గుర్తింపు



● జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష

నవతెలంగాణ-నెల్లికుదురు

వృత్తి నిర్వహణలో చేసే మంచి పనులే గుర్తింపుగా నిలుస్తాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల వీడ్కోలు పొందిన ఎన్‌సిడి విధులు నిర్వహించిన కస్తూరి విజయలక్ష్మికి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మురళీధర్‌తో కలిసి ఆమెకు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కస్తూరి విజయ ఆరు సంవత్సరాల క్రితం కాంట్రాక్టు పద్ధతితో ఇక్కడ విధులు నిర్వహించి మంచి ఆదరణ పొందిందన్నారు. ఆమెకు ఈ మధ్యకాలంలో ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతి నుండి పర్మినెంట్ ఉద్యోగం కల్పించడం వల్ల ఆమె వరంగల్ ఎంజీఎంకు వెళ్లిందన్నారు. ప్రతి ఒక్కరు వృత్తిపట్ల నిబద్ధతో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శారద, సిహెచ్ఓ శాంతమ్మ, వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు మంగమ్మ, సుల్తానా, రవి, పద్మావతి, పద్మారాణి, ఏఎన్‌ఎంలు స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలి : డీఈ విజయ్

నవతెలంగాణ-గూడూరు

గూడూరు సబ్ డివజన్ పరిధిలో గూడూరు కొత్తగుడ గంగారాం మండలాల విద్యుత్ ఎలాంటి ఆంతరాయాలు లేకుండా అందించాలని మహబూబాబాద్ డివిజినల్ ఇంజనీర్ పి.విజయ్ అన్నారు. సోమవారం గూడూర్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ సిబ్బంది సమావేశం గూడూరు సబ్ డివిజనల్ ఏడిఏ కే.కవిత ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ టి.విజయ్ హాజరై మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. లైన్ మరమ్మత్తులు, ట్రాన్స్ఫర్మర్‌ల మరమ్మత్తులు జరిపే ముందు ఆయా వినియోగదారులకుపై అధికారులకు ముందస్తు సమాచారం అందించాలని, త్వరలో జరగనున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షల దృష్ట్యా అంతరాయం లేకుండా అందిస్తూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించబోతున్న గృహజ్యోతి పథకాన్ని అందేలా కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మూడు మండలాల ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి : సీఐ టి.సంజీవ్



నవతెలంగాణ-తొర్రూరు

ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని తొర్రూరు సీఐ టి.సంజీవ పిలుపు నిచ్చారు.సోమవారం స్థానికంగా చాంబర్ ఆఫ్ కామర్స్ సహకారంతో మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హన్మకొండ సంయుక్తగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సంజీవ మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పత్తి వెంకన్న రక్తదానాన్ని కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో 140 యూనిట్ల రక్తం సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, యాదగిరి రెడ్డి, కిరణ్ కుమార్, ఉపేందర్, పాండు, కౌన్సిలర్ నర్కుటి గజానంద్, సంఘం కార్యకర్తలు ఉపాధ్యక్షుడు పేర్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటేష్, కార్యదర్శి పేర్ల ముత్తయ్య, కోశాధికారి పత్తి పవన్ పాల్గొన్నారు.

రూప్సింగ్ తండాకు త్రాగు నీరు సరఫరా

- 'నవతెలంగాణ' వార్తకు స్పందన



నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండలం చింతల గడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని రూప్సింగ్ తండాలో మంచినీటిని సరఫరా చేశారు. **'అస్తవ్యస్తంగా గ్రామపంచాయతీ పరిపాలన'** అనే శీర్షికతో ఆదివారం **'నవతెలంగాణ'**లో వచ్చిన వార్త కథనంపై అధికారులు సోమవారం స్పందించారు. మండల అధికారుల ఆదేశాల మేరకు చింతలగడ్డ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి అనురాధ పరిశీలించి తండావాసులకు తాగునీరును అందించారు. వ్యవసాయ భూమి ఉన్న రైతు తండాకు నీళ్ల రాకుండా వాడుకోవడంపై ఆమె బోరు మోటర్‌ను పరిశీలించారు. తండా ప్రజల దహార్తి తీర్చడానికి వేసిన బోరును వారికే నీరు అందించాలని ఆ రైతుతో రాతపూర్వకమైన హామీని తీసుకొని తండాప్రజలకు తాగునీరు కొరతను తీర్చారు. ఎండా కాలంలో తాగునీరు కొలతను తీర్చడానికి కృషిచేసిన 'నవతెలంగాణ' పత్రికకు అధికారులకు ఆ తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.



మంచినీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన

- గత మూడు వారాలుగా గిరిజనులు మంచినీటికి కటకట

నవతెలంగాణ-గార్ల

గత మూడు వారాలుగా మంచినీటి సరఫరా లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పుల్లూరు పంచాయతీ పరిధిలోని సూర్య తండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం సీపీఎం అధ్వర్యంలో తండాలో రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ మండలాలలో మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా మండల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారుగా 20 కుటుంబాలకు నీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపాదికన మంచినీటి సమస్యను పరిష్కరించి గిరిజనుల దాహార్తిని తీర్చాలని లేని యెడల దశల వారీగా ఆందోళన చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అజ్మీర శ్రీను, రమేష్, సాయి, నరేష్, ప్రవీణ్, రాందాస్, సీతా, మంజుల, హరి లక్ష్మీ, బాస్, వినోద్, కాంతి, భీమ్లా, మంగి, నీలా, మంగ్యి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

నవతెలంగాణ-గార్ల

గత ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించి వైద్య సిబ్బందిని ఆదుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ జిల్లా వైద్య అధికారులను కోరారు. స్థానిక సిహెచ్ ఆస్పత్రిలో సాయినాథ్ ఏజెన్సీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ అధ్వర్యంలో కార్మికులు సోమవారం సూపరింటెండెంట్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం ప్రతి పేదవారికి అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి చేయుతనిస్తూ ప్రభుత్వ వైద్య అధికారులు, సిబ్బందితో పాటు రాత్రులు, పగలు విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో నిత్యావసర వస్తువులు, కిరాయిలు తదితర కుటుంబ ఆర్థిక పరిస్థితులు రోజుకు రోజు చెల్లించలేక కార్మికులు తిప్పలు పడుతున్నారని ప్రభుత్వ స్పందించి ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఔట్ సోర్సింగ్ కార్మికులు దేవరాజ్, నరేష్, రమేష్, గోరి బాయి, విజయలక్ష్మి, వీరేందర్, వినోద్, సింధు, ఎల్లయ్య కళ, ఉమా, జాన్ బి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ముగింపు ఉత్సవాన్ని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-గార్ల

నేడు ఇల్లందు పట్టణంలో జరిగే సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల ముగింపు ఉత్సవాల్లో గిరిజనులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ బట్టు నాగరాజు కోరారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి,సాంప్రదాయాలు, వారి హక్కులను కాపాడటంలో సంత్ సేవాలాల్ మహరాజ్ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఎన్నో అటంకాలను ఎదుర్కొని గిరిజన ప్రజలకు అండగా నిలిచిన సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సేవాలాల్ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పుల్లూరు మాజీ సర్పంచ్ జాటోత్ రమేష్, సంత్ సేవాలాల్ కమిటీ సభ్యులు మాళోత్ శంకర్, బానోత్ కిషన్, ధరావత్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు వెలికి తీయాలి

- కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షులు అంజయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రికార్డులు పరిశీలించి రెవెన్యూ, ఇరిగేషన్, ల్యాండ్ సర్వే, మున్సిపల్ అధికారుల చేత హద్దులు నిర్ణయించి ప్రభుత్వం తరపున సర్వేనెంబర్లతో హెచ్చరిక బోర్డులతో పాటు భూముల వివరాలు విస్తీర్ణం ప్రజలకు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు గణపురం అంజయ్య ఒక ప్రకటనలో కోరారు. రియల్ ఎస్టేట్ కమర్షియల్ ప్లాట్ల కోసం నాలా కట్టి లే అవుట్ చేసిన భూములకు గ్రీన్ ల్యాండ్ ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి బోర్డులు పెట్టాలని గ్రీన్ ల్యాండ్ లేని వాటికి తక్షణమే స్పందించి నిబంధనల మేరకు గ్రీన్ ల్యాండ్ తీయాలని కోరారు. అధికారులు ప్రజలకుపూర్తి జవాబుదారీ పాలన అందించాలని సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ ధరఖాస్తులు పట్టుకుని ప్రజలు తిరగకుండా చూడాలని కోరారు. జిల్లా కేంద్రంలో నివాసం కోసం ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారి వివరాలు పరిశీలించి అర్హులైన అందరికి ఇంటి స్థలం ఇంటి నిర్మాణం మంజూరు కోసం అనుమతులు ఇవ్వాలన్నారు.

మాజీ సర్పంచ్, ఎంపీఓపై చర్యలు తీసుకోవాలి

- ఎంపీడీవోకు వినతి



నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లయ్య, ఇన్చార్జి కార్యదర్శిగా చేస్తున్న ఎంపీఓ యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు ధారాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆదాం, శేఖర్, శ్రీను, జహంగీర్ పాషా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండల కేంద్రంలో 100డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగాయి. అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేయకుండా సంపన్నులకే ఇండ్లు మంజూరు చేసి గ్రామ సభ ద్వారా తీర్మానం చేయకుండానే చేసినట్లు లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేశారు. ఇప్పటికైనా డబ్బులు తీసుకున్న వాళ్లకు వాపస్ ఇచ్చి గ్రామ సభ ద్వారా అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి వెంట శోభ, వెంకన్న, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధనుసరి వేలవేల్పు శ్రీ సరళమ్మ గుడి నిర్మాణ భూమి పూజ

నవతెలంగాణ-గంగారం

మండలంలోని జంగాలపల్లి గ్రామంలో ధనుసరి వంశీయుల వేలవేల్పు సరళమ్మ గుడి నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాన్సరి సారయ్య, సమ్మయ్య, సుధాకర్, రవితేజ, నాగేశ్వరరావు, కేశవరావు, బాబురావు, అశోక్, అరుణ్, వినోద్, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధి పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- కేవీపీఎస్ నేత జిన్నా లచ్చయ్య



నవతెలంగాణ-మరిపెడ

మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అబ్బాయి పాలెం గ్రామంలో కొమ్ముకుంట రాళ్ల ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడగా గత సంవత్సరం చేసిన పనులకు బిల్లులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారని లచ్చయ్య పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత బడ్జెట్‌లో 80 వేలకోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపాధి కూలీలకు రావలసిన బిల్లులను సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. అంతేగాక మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న కూలీలు ఇప్పటికే పనులు లేకుండా నష్టపోగా, గ్రామీణ ప్రాంత కూలీలకు రావలసిన నిధులను వారికి రాకుండా దారి మళ్లిస్తుందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా 200 రోజుకు పని దినాలు పెంచాలని, రోజుకు 267 దినసరి కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ 2005లో వామపక్షాల సహకారంతో ఆనాటి యూపీఏ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఈ చట్టాన్ని తీసుకురాగా ఆ చట్టానికి తూట్లు పొడుస్తూ బిజెపి ప్రభుత్వం నిధులను ఇతర రంగాలకు దారి మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క వ్యవసాయ రంగం సంక్షోభంలో నెట్టు వేయగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో వ్యవసాయ భూములన్నీ వ్యాపార కేంద్రాలుగా మారాయన్నారు. సంవత్సరానికి సరిపోను పనులు లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారికి రావలసిన గడ్డపార, పారా, తట్టలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.సంధ్య, అర్.శోభారాణి, కౌసల్య, ఊరుకొండ వెంకన్న, అలవాల సీతారాములు, జినక కృష్ణమూర్తి, సువార్త, కత్తుల మహేష్ ఎల్లమ్మ, కోల మన్సూర్, తోపాటు వందలాది మంది కూలీలు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రమోషన్‌లు కల్పించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, జిల్లా కలెక్టర్‌కి వినతి



నవతెలంగాణ-మహబూబాబాద్

పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీఈఓ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి దారా స్నేహ బిందు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70,000 మంది అంగన్వాడి ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో సగం మంది అంగన్వాడి హెల్పర్లు గత 45 సంవత్సరాలు పైగా అంగన్వాడి కేంద్రాల్లో పనిచేస్తున్నారు. వీరికి గతంలో ఎస్ఎస్‌సీ అర్హత ప్రకారం టీచర్లుగా ప్రమోషన్స్ సౌకర్యం ఉండేది. గత ప్రభుత్వం 2022 డిసెంబర్లో విద్యార్హతను ఇంటర్‌గా మార్చింది. అంగన్వాడీ టీచర్ పోస్ట్ భర్తీ చేయాలంటే ఇంటర్ ఉండాల్సిందేనని ప్రభుత్వం అంటుంది. కొత్త, పాత తేడా లేనప్పుడు ఇది ప్రమోషన్స్ సౌకర్యం ఎలా అవుతుందో ప్రభుత్వం పరిశీలించాలని, ప్రమోషన్ అంటేనే కార్మికులు పనిచేసిన కాలాన్ని సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని, దీనినే కోలబద్ధగా చూడాలి అంతేతప్ప కీలకమైన ఈ అంశాలను పక్కనపెట్టి విద్యా అర్హతలను ముందుకు తేవడం అంటే అంగన్వాడి హెల్పర్లకు అన్యాయం చేయడం తప్ప మరొకటి కాదని అన్నారు. పాత పద్ధతి ప్రకారమే ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సానుకూలంగా ఈ సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్స్ నాయకులు మంగమ్మ మౌనిక, యమునా, సరోజా, సుజాత, జ్యోతి, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల దుర్వినియోగంపై అధికారులకు పట్టింపు లేదా..?





నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండలం ఎడ్జర్ల గ్రామంలో ఓ మామిడి తోట వ్యవసాయ పనులకు గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్‌ని వాడుకుంటున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వాటర్ ట్యాంకర్ దుర్వినియోగం బయటకు వస్తున్నాయి. ఎడ్జర్ల గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓకాంట్రాక్టర్ తన మామిడి తోట వ్యవసాయ పనులకు వాటర్ ట్యాంకర్‌ను ఉపయోగించుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.అంతేగాక తోటకు కంచ నిర్మాణానికి వాడే సిమెంటు ఫోల్స్‌కు వాటర్ క్యూరింగ్ కోసం గత 15 రోజుల నుండి పనులకు వాడుకుంటున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదే విషయంపై స్థానిక కార్యదర్శికి కాల్ చేయగా సరైన సమాధానం చెప్పలేక పోయారు. మండలంలో రోజు ఏదో ఒకచోట గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్ దుర్వినియోగం అవుతున్న అధికారులు పట్టింపులేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గుర్రపుతండలో సైతం....

మండలంలోని గుర్రపుతండా జీపీ వాటర్ ట్యాంకర్ ప్రైవేటు పనులకు వాడుకుంటున్నారు. సోమవారం గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ఇంటి నిర్మాణానికి నీళ్లను సరఫరా చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సర్పంచుల పరిపాలన ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల పరిపాలనలో పర్యవేక్షణ లోపిస్తున్నట్లు స్పష్టమవుతుంది. పంచాయతీ కార్యదర్శులకు తెలిసిన ఏం మాట్లాడక పోవడంతో వాటర్ ట్యాంకర్ల దుర్వినియోగం రోజురోజుకు పెరుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీపీకి కేటాయించిన ఆస్తులను కాపాడుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.



షాదీఖానా కోసం ముస్లిం జేఏసీ ధర్నా

నవతెలంగాణ-మహబూబాబాద్

పేద ముస్లిం అమ్మాయిల పెళ్ళిళ్ళ కై ఉచితంగా ఇవ్వడానికి కట్టబోయే షాదీఖానా (ఫంక్షన్ హాల్) కొరకు ఎన్ఓసీ కొరకు 5 లక్షలు డిమాండ్ చేస్తూ, ఏడాదిన్నరగా వేధిస్తున్న డీఈఈ కిశోర్ కుమార్ వేధింపులను భరించలేక సోమవారం మహబూబాబాద్ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ నెక్లెస్ రోడ్ తొలగింపు పేరిట మా పట్టా భూమిలో దాదాపు 15, 20 లక్షల మట్టి అమ్ముకున్న కిశోర్‌పై గత కలెక్టర్ శశాంక్‌కు ఫిర్యాదు చేయగా విచారణ జరిపించి, రిపోర్ట్ ఇవ్వాలని ఈఈను కలెక్టర్ ఆదేశిస్తే, రెండు నెలలైనా రిపోర్ట్ ఇవ్వలేదన్నారు. నిజాంచెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు పెట్టమని గత కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్, ఎమ్మెల్యే మురళినాయక్ పదేపదే ఆదేశించినా, ఇంత వరకు ఇరిగేషన్ అధికారులు హద్దులు పెట్టక, నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హద్దులు పెట్టడానికి డీఈఈ ముస్లింల నుండి నుండి 25 లక్షల రూపాయలు డిమాండ్ చేశారన్నారు. ముస్లింల భూములపై తప్పుడు రిపోర్ట్ ఇస్తున్న కిషోర్ పై విచారణ జరిపించాలని కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జహిరుద్దీన్, ముస్లిం జేఏసీ నాయకులు అలీం, జీయా, రవూఫ్, సలీం, అజీజ్, ఫిరోజ్ పాల్గొన్నారు.



విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళి కృష్ణ
- తొర్రూర్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహసభలు నిర్వహణ

నవతెలంగాణ-తొర్రూరు

ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా మహసభలు తొర్రూర్ పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అధ్యక్షతన సోమవారం జరిగాయి.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం చదువుతూ, చదువులో ఉన్న సమస్యలు తెలుసుకుంటూ పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చదువును కాషాయికరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే ఈరోజు కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులను మూఢవిశ్వాసాలు వైపుకు మార్చే విధంగా రూపొందించారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలు చేయడంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెలోత్ సాయికుమార్, సీఐటీయూ నాయకులు బొల్లం అశోక్, యండి యాకుబ్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు వీరబాబు, సూర్య, జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతి బసు, సింహాద్రి, జ్యోతి, నాయకులు ప్రవీణ్, సుమంత్, నవీన్, వెంకీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో కుక్కర్ పేలి వర్కర్లకు గాయాలు



నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహం వంటశాలలో ప్రమాదవశాత్తు కుక్కరు పేలడంతో ఇద్దరు వర్కర్లు సప్నారి స్వప్న, మంజులకు గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గమనించిన విద్యార్థులు, ఎస్ఓ లలిత వెంటనే ప్రమాదం జరిగిన సంఘటన నుండి దూరంగా తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు.

సమస్య ఏదైనా నాకు చెప్పండి

- ఎమ్మెల్యే డాక్టర్ ముఖ్య మురళి నాయక్



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంజనీరింగ్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అలాగే హాస్టల్లో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల ఆజాగ్రత్త వహించిన వారిపైన కఠిన చర్యలు తప్పవని ఇంజనీరింగ్ కళాశాల యజమాన్యాన్ని హెచ్చరించారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏం డేవిడ్

నవతెలంగాణ-మహబూబాబాద్

గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. సోమవారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు గ్రీవెన్స్‌లో వచ్చిన ధరఖాస్తులను పరిష్కరించి ప్రజలకు సమాధానం తెలుపాలన్నారు. ఈ సందర్భంగా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన తాళ్ల సోమలక్ష్మి గ్రామంలోని తనకు చెందిన భూమి సర్వే నెం.110, 111, 112 గల మిగులు భూమి వేరే ఇతర వ్యక్తులు తమ పేర్లపై నమోదు చేసుకున్నారని రీ సర్వే చేసి తన భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇవ్వాలని కోరారు. తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన వికలాంగురాలు డొనుక సౌజన్య వికలాంగ ఫించను ఇప్పించాలని కోరారు. ఇరుగు వెంకటేష్, కప్పల సాయికిరణ్ షెడ్యూల్ కులాల హాస్టల్‌లో గత 8 నెలల నుండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నా తమకు జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని జీతాలు ఇప్పించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.కేసముద్రం మండల కేంద్రంలో ప్రభుత్వం వారు ఇచ్చిన ఇళ్ళ స్థలాలలో ఇళ్ళ నిర్మాణం చేపడుతుంటే ఇతర వ్యక్తులు అడ్డుకుని ఇళ్ళ నిర్మాణంలో అడ్డు తగులుతున్నారని ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్‌లో (76) దరఖాస్తులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, సిపిఓ సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-నెల్లికుదురు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్షలు రాసేందుకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేశామని పరీక్ష నిర్వాహకులు సిఎస్ శ్రీనివాస్ రెడ్డి, డివో నాగిరెడ్డిలు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (పరీక్ష సెంటర్ నెంబర్ 40007) ఏర్పాటు చేసి ఆ సెంటర్లో ఆ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, ఆదర్శ పాఠశాల కళాశాల, నరసింహులపేట ఆదర్శ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ప్రథమ సంవత్సరానికి చెందిన 341 మంది, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 312 మంది విద్యార్థులు మొత్తం కలిపి 653 విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అన్ని రకాల సదుపాయాలను కల్పించామన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఒక్క నిమిషంలో ఆలస్యమైనా అనుమతిలేదని తెలిపారు. ఈ కళాశాలలో 653 మందికి 8 రూముల్లో ఒక్కొక్క రూమ్‌లో 48 మంది విద్యార్థులు కూర్చొని పరీక్షలు రాస్తారని అన్నారు. ఈ రూమ్‌కి ఇద్దరు ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లను, బెంచీలు, వాటర్, విద్యుత్, సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం నుండి 100 మీటర్ల వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని,చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్, బుక్ స్టాల్ మూసి వేయాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టమైన చర్యలు ఉంటాయని పరీక్ష కేంద్రం సిఎస్ శ్రీనివాస్ రెడ్డి, డీవో నాగిరెడ్డి తెలిపారు.

బాబోజి గూడెంలో గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బావోజీగూడెం గ్రామపంచాయతీ, బోజ్యతండాలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధమైంది. బాధితుడు, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం బోజ్యతండాకు చెందిన గుగులోత్ బోజ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే తన పశువుల కోసం కొట్టం వద్ద 500 మోపుల గడ్డి మోపు చేసి పెట్టాడు. కాగా కొంతమంది గుర్తుతెలియని దుండగులు గడ్డివాముకి నిప్పుపెట్టడంతో గడ్డివాము పూర్తిగా కాలిపోయిందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిన వెంటనే వచ్చి మంటలార్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక వ్యవహారాలలో ప్రజల్లో చైతన్యం పెరగాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్

నవతెలంగాణ-మహబూబాబాద్

ఆర్థిక వ్యవహారాలలో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. సోమవారం భారతీయ రిజర్వ్ బ్యాంకు రూపొందించిన పోస్టర్లను, పుస్తకాలను జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాలపై ప్రజల్లో చైతన్యం, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తత అవసరమన్నారు. బ్యాంకు లావాదేవీల పట్ల నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.రుణాలపై అవగాహన లేకుండా పొందకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రమాదేవి, డిఆర్‌డిఏ పిడి పురుషోత్తం, పశుసంవర్ధక శాఖ అధి కారి సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ నర సింహ స్వామి పాల్గొన్నారు.

ముగింపు ఉత్సవాలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-బయ్యారం

రేపు ఇల్లందులో సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ముగింపు ఉత్సవాలు, ఆధ్యాత్మిక సభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి తేజావత్ రవీందర్ నాయక్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సేవాలాల్ రైతు సేన మండలాధ్యక్షులు గుగులోతు నరేష్ నాయక్, సేవాలాల్ సేన మండల ప్రధాన కార్యదర్శి భూక్యచిరంజీవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-భూపాలపల్లి

మొబైల్ ఫోన్‌లో మీ వ్యక్తి గత వివరాలు పూర్తి సమాచారాన్ని ఇచ్చి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి అని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ముద్రించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రయాణం చేసినప్పుడు బస్‌స్టేషన్లలో, రైల్వే స్టేషన్లలో కేబుల్ వైర్లతో బిగించిన ఛార్జింగ్ సాకెట్లలో మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెడితే మీ వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. మొబైల్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎల్ తిరుపతి, బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యా ర్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భం గా ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్య దర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ ప్రతిభ పరీక్షలతో విద్యార్థులల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చని సూచించారు. పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇలాంటి టెస్టులు చాలా ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో హై స్కూల్ కార్యదర్శి చేకుర్తి రామ్‌చరణ్, ఎస్ఎఫ్ఐ మహదేవపూర్ మండల నాయకులు సుమన్, హై స్కూల్ ఇన్‌చార్జి సతీష్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ స్థలంలో చదును చేయాలి



బౌండరీలు ఏర్పాటు చేసి

టెండర్ నోటీసు జారీ చేయాలి

త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి

మెడికల్ కాలేజ్ నిర్మాణ స్థలాన్ని చదును చేసి త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లోగల రామప్ప కాలనీని అనుకోని ఉన్న 22 ఎకరాల ప్రభుత్వ భూమిని మెడికల్ కాలేజీ నిర్మాణానికి కేటాయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్అండ్ బీ అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించి మాట్లాడారు. ఎత్తు పల్లాలుగా ఉన్న భూమిని చదును చేసి చుట్టూ బౌండరీలు ఏర్పాటు చేసి టెండర్ నోటీస్‌లు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిలువకుండా ఇరిగేషన్ ఈ ఈతో సూచనలు తీసుకుని నీరు నిలువకుండా కాలువను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. టెండర్ ప్రాసెస్‌ను పూర్తి చేసి త్వరితగతిన నిర్మాణ పనులను చేపట్టి సకాలంలోనే బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ, డీఈ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నవతెలంగాణ-ములుగు

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జాతర విజయవంతం చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమ వారం జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3 దరఖాస్తులు రాగా 2 రెవెన్యూ, 1 ఇతర శాఖకు చెందినవి ఉన్నాయి. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం మహా జాతరలో అధికారుల అంచనాలకు మించి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి జాతరను విజయవంతం చేశారని అన్నారు. జాతర ముగిసిన అనంతరం కూడా మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులు కొనసాగుతు న్నాయని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో పనులు వేగవంతంగా నిర్దిష్టమైన సమయంలో పూర్తి చేసినందుకు ఈఈ అజయ్ కుమార్, ఏఈ అజిత్ కుమార్‌ను అభినందించారు. జిల్లా అధికారులు వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, వైద్య అధికారి అలేం అప్పయ్య , షెడ్యూల్ కులాల అధికారి తుల రవి, పంచాయతీరాజ్ అజయ్ కుమార్, ఎల్‌డిఎం రాజ్‌కుమార్, తహసీల్దార్ విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య

నవతెలంగాణ-మంగపేట

ఈ నెల 28వ తేది నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎక్కటి సరోజని శేశారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచర్యులు గూళ్ళ వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28వ తేది నుండి మార్చి 13వ తేది వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో 114మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 29వ తేది నుండి మార్చి 14వ తేది వరకు పరీక్షలు జరుతాయని వెల్లడించారు. ద్వితీయ సంవత్సరంలో 123మంది విద్యార్థులు ప్రస్తుతం కళాశాలకు హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పరీక్షల నిర్వహణకు 6 గదులను కేటాయించినట్లు తెలిపారు. ఫ్యాన్లు, లైట్లు, సీసీ కెమెరాలతో పాటు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెంకటయ్య వివరించారు. విద్యార్థులు ఉదయం 8గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఇప్పటి వరకు హాల్ టికెట్లను తీసుకోని విద్యార్థులు నేడు కళాశాలకు వచ్చి తీసుకావాలని సూచించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు జె.జ్యోతిర్మయి, వై రేణుకాదేవి, మండల సంతోష్ కుమార్, పాగి అనిల్ కుమార్, లక్ష్మణ, జె.రవీంద్ర నాయక్, శ్రీనివాస్, మంతెన చిరంజీవి, రాజు, వందన, వైష్ణవి పాల్గొన్నారు.



పీఓ బదిలీ నిలిపి వేయాలని ధర్నా

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

ఐటీడీఏ పీఓ అంకిత్‌ను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేయగా ఆ బదిలీని నిలిపివేయాలని నాయపోడు, తుడుందెబ్బ మహిళా సంఘాల నాయకులు సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట ప్రదాన రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేస్తూ పీఓ బదిలీని వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఆదివాసీ మహిళా సంక్షేమ పరిషత్ అధ్యక్షురాలు బోదెబోయి స్వాతి, ప్రధాన కార్యదర్శి చేల శమంతకమణి, గౌరవ అధ్యక్షురాలు బడే సులోచనలు మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం చేస్తున్న పీఓను అకారణంగా బదిలీ చేయడం బాదాకరం అన్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ స్పందించి పీఓ బదిలీని వెంటనే నిలిపివేయాలన్నారు. గిరిజన గూడాలు బాగుపడాలి అంటే ఇలాంటి పీఓ ఏజెన్సీలో ఉండాలన్నారు. అనంతరం కానిస్టేబుల్ సుధాకర్ వచ్చి నచ్చజెప్పి శాంతింపచేశారు. అనంతరం ఐటీడీఏ ఏపీఓ వసంత రావుకు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కోరం పుష్ప, పీరీల సుమలత, ఆగబోయిన గౌతమి, పొడె అరుణ, వాసం జమున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి నూతన కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ ఛాంబర్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 52 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుండి సిఫార్సు చేసిన ప్రజా సమస్యలకు వెనువెంటనే పరిష్కరించి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

ఈవీఎం మొదటి దశ కమిషనింగ్

నవతెలంగాణ-ములుగు

సోమవారం కలెక్టరేట్ లోని ఈవీఎం గోదాంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఈవీఎం మొదటి దశ (ఎఫ్ఎల్ సి) కమిషనింగ్ ను జిల్లా అదనపు కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో విజయ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-మంగపేట



జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భం గా ఈ నెల 28న విద్యా శాఖ సహకారంతో జ్వాలా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వైజ్ఞానిక ప్రదర్శన క ర ప త్రా న్ని తహసీల్దార్ భైరి వీరస్వామి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో మేథో సంపత్తిని పెంపొందిస్తుందని అన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన కార్యక్రమాన్ని జ్వాలా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మల్లేశ్వరరావు, జెడ్పీహెచ్ఎస్ కమలాపురం హెడ్మాస్టర్ గడ్డి శ్రీనివాస్, జ్వాల స్వచ్ఛంద సంస్థ సలహాదారు కోలగట్ల నరేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, ఆదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ ప్రసాద్, శ్రీధర్ ఆర్ఎంసి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు శిరీష, జ్వాలా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఇష్టంతో కష్టపడి చదవాలి

సీఐ వేణు చందర్

నవతెలంగాణ-చిట్యాల

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సీఐ వేణు చందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడుకోలు సమావేశానికి సీఐ వేణు చందర్, ఎస్సై రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు కన్న కలలను సాధించాలంటే విద్యార్థులు దఢ సంకల్పంతో ఆత్మస్థైర్యంతో చదువు పట్ల మక్కువతో ఇష్టంతో కష్టపడి చదివి తాము ఎంచుకున్న పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో తాము ఎదుర్కొన్న సమస్యల పట్ల విద్యార్థులకు వివరించారు. గతంలో చదువుకున్న వారికి ఇన్ని అవకాశాలు లేవని ఇప్పుడున్న విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అంది పుచ్చుకొని విజ్ఞానాన్ని సంపాదిస్తే ఏదైనా సాధించవచ్చునే భరోసా విద్యార్థులు కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిఐ వేణు చందర్ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి వైస్ ప్రిన్సిపాల్ సత్యం పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బండారు మల్లయ్య సోమవారం అకాల మృతి చెందారు. మతుడు బండారు మల్లయ్య కుమారుడు శ్రీను, అల్లుడు ఓ ప్రముఖ విలేఖరి మంథని సమ్మయ్యలు వరంగల్ పార్లమెంట్ అస్పిరెంట్ డాక్టర్ పెరుమండ్ల రామకష్ణకు మిత్రులు కావడంతో బండారు మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకష్ణ మాటాడుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేద ప్రజలందరికి తోడుంటారని, ప్రతి కష్టంలో పాలుపంచుకొని అండగా ఉంటారన్నారు. భూపాలపల్లితో తనకు మంచి బంధం ఉందని, మా బంధువులు మేనత్త మామయ్య మైనింగ్‌లో ఉద్యోగం చేసేవారని తెలిపారు. సింగరేణి సమస్యలు చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సహకారంతో పరిషారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాలా శ్రీనివాస్ నాయకులు జగన్‌గౌడ్, సాంబయ్య, మహేష్, నవీన్, ఉపేందర్, రఘు ఉన్నారు.



తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఎంపీపీ కావాటి రజిత రవీందర్

నవతెలంగాణ-గణపురం

రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ కాబట్టి రజిత రవీందర్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పంచాయతీ కార్య దర్శులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. గ్రామంలో ఉన్న బోరింగులు రిపేరు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ప్రశాంత్ వైస్ ఎంపీపీ అశోక్ కో ఆప్షన్ చోటేమియా ఎంపీటీసీ సాగర్ సుధర్మ మలహర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు పోలీసులు అండగా నిలవాలి

ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకోవాలి

అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ



నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజలకు, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 16మంది నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ప్రజాదివాస్‌లో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలిస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంతో పాటు, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చితంగా న్యాయం జరుగుతుందనే భరోసా బాధితులకు పోలీసులు కల్పించాలని సూచించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్‌కుమార్

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రైతులపై దాడి చేపిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, తెలంగాణ వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటి చంద్రమౌళి మాట్లాడారు. ఫిబ్రవరి 13న 200రైతు సంఘాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్టు తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, నూకల చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, పీక రవి, అరబోయిన వెంకటేష్, పొనగంటి లావణ్య, వెంకటేశ్వర్లు, గోలి లావణ్య, ఎండ్ సాబీర్, రమేష్, వనిత, యాకుబ్ పాషా, రమేష్‌చారి పాల్గొన్నారు.

మల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-మంగపేట



మండలంలోని మల్లూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద భద్రయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా మారి పాఠశాలను నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎంపల్లి చాందిని, గన్నోజు చరణ్యకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందా భద్రయ్య బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొరస సారయ్య, కోడి వెంకటేశ్వర్లు, ఈసం కష్ణవేణి, ఈసం అనసూర్య, అబ్బు సత్యనారాయణ, జమీల్, రఘు, సురేందర్, నాలి రాంబాబు ఆగబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సదానందంకే మద్దతు

కేటీపీపీ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ



నవతెలంగాణ-గణపురం

త్వరలో జరగనున్న వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో పరికి సదానందం కే తమ మద్దతు ఉంటుందని కేటీపీపీ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ (టీఎస్పీఈ) తెలిపింది. సోమవారం కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో జాక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వరంగల్ లోకసభ నియోజకవర్గం నుండి ఎంపీగా పోటీ చేయుచున్న పరికి సదానందంకు పూర్తిగా మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్, యూనియన్ నాయకులు పుట్ట తిరుపతి, మాకుల సంతోష్, నరేష్, మాధవరావు, కనకరాజు, రాజు, అఫ్జల్, వేణు, వీరేష్, రాజకుమార్,సంతోష్, వీరభద్రం, సతీష్, మురళి, కిషన్, వంశీ, భాస్కర్, కుమార స్వామి,రాజు, నరసయ్య, జమీర్, లక్ష్మణ్, లింగమూర్తి, శ్రావణ్, శంకరయ్య రత్నాకర్, తేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

మద్యం మత్తులో గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కూతురు మధూకర్(46) కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో అకారణంగా గొడవ చేసి మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ హాస్పిటల్ తరలిస్తున్న క్రమంలో మతి చెందాడు. మృతుని కొడుకు రాహుల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

నేడు వైద్య ఉద్యోగుల మహాసభ

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

యాదగిరిగుట్టలో మంగళవారం నిర్వహించనున్న ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల యూనియన్ (3194)55వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు అర్షం స్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో వైద్యాధికారిని నాగరాణి ఆధ్వర్యంలో జరిగిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను నాణ్యమైన పీఆర్సీని త్వరలో ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, 317 జీవోలో అన్యాయం జరిగిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డి మాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏర్పాటుచేసిన 142 జీవోను వెంటనే విరమించుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తాళ్లపల్లి రవీందర్, హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మ, సూపర్వైజర్ సునీత, ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ, హెల్త్‌అసిస్టెంట్ బిక్షపతి, ఏఎన్ఎం సునీత, శీను, సిబ్బంది పాల్గొన్నారు.



తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

నవతెలంగాణ-మల్హర్‌రావు

రానున్న వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు అధికారులను కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవి తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యల కోసం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మండల ఎంపీడీఓ శ్యాం సుందర్, స్పెషల్ అధికారి అవినాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో మిషన్ భగీరథ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శులు తమ దష్టికి తీసుకొచ్చినట్లుగా ఏఈ హరిత తెలిపారు. గ్రామాల్లో ముగజీవాల దప్పిక తీర్చడానికి గతంలో నిర్మాణం చేపట్టిన నీటి తొట్టీలకు మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, ఏఈ అశోక్, వ్యవసాయ అధికారి సుధాకర్, ఎంపీఓ విక్రమ్, స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

రానున్న వేసవిలో మండల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టరుకు నివేదిక అందజేస్తామని ఎంపీపీ బి రాణీబాయిరామారావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ బి. రాణీబాయి రామారావు అధ్యక్షతన తాగునీటి నీటి ఎద్దడి నివారణపై సమీక్షించారు. మండలంలో 18మందికి కేవలం ముగ్గురు ప్రత్యేక అధికారులు మాత్రమే హాజరుకాగా మిగిలినవారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు సుధాకర్, దుర్గయ్య , ఎంపీవో ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వినయ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీఐ కార్యకర్త కుమార్‌యాదవ్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రంలోనితాడిచెర్ల గ్రామానికి చెందిన చింతల కుమార్‌యాదవ్ సామాజిక కార్యకర్తగా, సీనియర్ జర్నలిస్టుగా తనవంతుగా చేస్తున్న సేవలకుగాను సోమవారం ఎంపీపీ చింతల అధ్యక్షతన స్పెషల్ అధికారి అవినాష్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్, తహసీల్ధార్ రవికుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ అశోక్, డీటీ శ్రీనివాస్, ఎంపీఓ విక్రమ్, మిషన్ భగీరథ ఏఈ హరిత సన్మానించి అభినందించారు. కాటారం సబ్ డివిజన్ (ఆర్టీఐ) సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక కన్వీనర్‌గా కుమార్ యాదవ్ ఎన్నికై ఇటీవల హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఆర్టీఐ ఉద్యమకారుల వర్క్ షాప్‌ను విజయవంతంగా ముగించుకొని రెండ్రోజుల శిక్షణ పొందారు. ఆర్టీఐ సక్సెస్ స్టోరీలు ప్రదర్శించిన నేపథ్యంలో రాష్ట్ర స్థాయి సర్టిఫికెట్ కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వల్లెంకుట ఎంపీటీసీ ఏనుగు నాగరాణి, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, ప్రసాద్, ప్రవీణ్, శేఖర్, రాజు, చరణ్, రమేష్, సతీష్, కుమారస్వామి, శివ, సమ్మరాజు, సరిత, భాస్కర్ పాల్గొన్నారు.

'మహిళల్లో సాధికారితను పెంపొందించాలి'

నవతెలంగాణ-రేగొండ

మహిళల్లో సాధికారితను పెంపొందించడం కోసం వివిధ సంస్థలు ముందుకు రావాలని అమెరికాకు చెందిన బీసీఐ ప్రతినిధి కార్నే అన్నారు. సోమవారం మండలంలోని జూబ్లీనగర్ గ్రామంలో లెంకల తిరుపతిరెడ్డి పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్నే మాట్లాడుతూ రైతులందరూ వివిధ పంటలతో పాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చే పండ్ల తోటలను సాగు చేయాలని సూచించారు. మామిడి సాగులో వేసిన అరటి, మిర్చి పంటలను పరిశీలించి ఒకే రకమైన నేలలో పలు రకాలుగా పంటలను సాగు చేసిన తిరుపతిరెడ్డిని అభినందించారు. సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణపూర్ గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం, తెలంగాణ అకాడమీ కన్స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ నేర్చుకునే కార్యక్రమాలను పరిశీలించి మాట్లాడారు. కుట్టుమిషన్ కార్యక్రమంలో మహిళలు పాల్గొని తన నైపుణ్యాన్ని చాటుకోవడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య, డబ్ల్యూడబ్ల్యూ ఎఫ్ అసోసియేట్ డైరెక్టర్ పుల్లూరి వంశీకృష్ణ, ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం సీఈఓ పెద్దపల్లి రామ్మూర్తి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ ఇన్నారెడ్డి, రేగొండ పీయూ మేనేజర్ బత్తిని శ్రీనివాస్, శాయంపేట అసోసియేట్ పీయూ మేనేజర్ అక్కల రమేష్, నారాయణపూర్ గ్రామ శిక్షణ నిర్వాహకురాలు రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



అనాథలకు అండగా 'అయిలి మారుతీ'

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మండలంలోని కాలేశ్వరం గ్రామానికి చెందిన పట్టి మల్లేష్ కుటుంబంపై కొన్ని రోజుల కితం కొందరు ఆయుధాలతో దాడి చేయడంతో దాడిలో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, వారి కొడుకుకు త్రీవ గాయాలు కాగా వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే వారు ఆర్థికంగా దీనస్థితిలో ఉండటంతో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి సోమవారం వారి ఇంటికెళ్లి పరామర్శించారు. ఆస్పత్రి, ఇతర ఖర్చుల కోసం రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమానికి యూత్ ఇంచార్జి చింతకింది రాజు, బల్ల సంపత్, వర్షిత్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మండలంలోని రాపల్లి కోట గ్రామానికి చెందిన బొచ్చు రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులకు సోమవారం దాతలు రూ.5100లు ఆర్థికసాయం అందజేశారు. పేద కుటుంబానికి ఆర్థికసాయం చేసిన దాతలకు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా అతని కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ గుడాల అరుణశ్రీనివాస్ పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాన-మహదేవ్‌పూర్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలం రాపల్లికోట గ్రామానికి చెందిన బొచ్చు రాజు కుటుంబాన్ని సోమవారం యాదవ సంఘం కమిటీ సభ్యులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రాజు కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ కాటారం మనోహర్, డివిజన్ కమిటి నాయకులు బోయిని రాజయ్య యాదవ్, చంద్రయ్య యాదవ్, రామన్న యాదవ్, అబ్బినవేని ఐలయ్య యాదవ్, మొగిలి, రాజ్‌కుమార్ యాదవ్, కొమరయ్య శ్రీనివాస్ యాదవ్, కాత్రేవుల నవీన్ యాదవ్, రాజయ్య యాదవ్, రాపెల్లి కోట గ్రామ అధ్యక్షులు పంచిక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ధార్ రవీందర్ సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-తాడ్వాయి

మేడారం మహా జాతర-2024 విజయవంతం కావడానికి స్థానిక తహసీల్ధార్ తోట రవీందర్ సేవలు ప్రశంసనీయమని వివిధ శాఖల అధికారులు, ఉన్నతాధికారులు కొనియాడారు. సోమవారం ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్ ఎండోమెంట్ అధికారులు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయనకు (తాసిల్దార్ రవీందర్) శాలువాలు కప్పి వనదేవతల ఫొటో, మొమెంటో అందించి ఘనంగా సన్మానించారు. స్థానిక తాసిల్దార్ తోట రవీందర్ మండలానికి అనధికాలంలోనే వచ్చిన తనదైన శైలిలో పేద ప్రజలకు సేవలు అందించి మండల వ్యాప్తంగా అందరి మన్నలను పొందారని కొనియాడారు. మంత్రి సీతక్క గుర్తించి వివిధ శాఖల ఉద్యోగులతో పాటు ప్రత్యేకంగా స్థానిక తహసీల్ధార్ రవీందర్‌ను సన్మానించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని రుద్రారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం గ్రామంలోని 5,6 వార్డుల్లో మెరుగు రాజబాబు ఇంటి నుంచి మాచర్ల రాజయ్య వరకు, భీముని వెంకటస్వామి ఇంటి నుంచి సుశీల ఇంటి వరకు రూ.8 లక్షలు జెడ్పీ నిధులు, రూ.3లక్షలు డీఎంఎఫ్టి నిధులతో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ బడితెల స్వరూపారాజయ్య కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సంగ్గెం రమేష్ పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-గణపురం

మండలంలోని మైలారం, గాంధీనగర్ గ్రామాలలో ఉన్న నర్సరీలను సోమవారం ఎంపీడీవో భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో నూరు శాతం మొక్కలు బతికేలా చూడాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయం పాలన పాటించి చెట్లకు నీరు పట్టాలన్నారు. ప్రతి నర్సరీకి షేర్ నెట్ కట్టాలన్నారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శులు నవీన్, రాకేష్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు శారద, నరసయ్య పాల్గొన్నారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్

నవతెలంగాణ - ములుగు

కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో కనీస మద్దతు ధర కోసం రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సోమవారం దేశవ్యాప్త పోరాటంలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంపాల రవీందర్ మాట్లాడుతూ... గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దుకు జరిగిన పోరాటం నేపథ్యంలో చట్టాలను రద్దు చేస్తూ ఆరు నెలలు సమయం ఇస్తే కనీసం మద్దతు ధరకు చట్టం చేస్తామని హామీనిచ్చి నేటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. మళ్లీ రైతు ఉద్యమాలను అణచివేసేక్రమంలో మరో యువరైతు ప్రాణాలు పోగొట్టుకున్నాడని అన్నారు. మరో రైతు గుండెపోటుతో మరణించాడని అన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ వెంటనే రైతులకు కనీస మద్దతు ధం చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రాష్ట్రంలో సైతం రైతాంగం సమరశీల ఉద్యమాలకు సిద్ధం అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ముత్యాల రాజు,బండి నరసయ్య, అమ్జద్ పాషా, ఇంజం కొమురయ్య, శ్యాంసుందర్, నటరాజ్, రమేష్, రాకేష్, రైతు సంఘం నాయకులు మహేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు

కాటారం మండలంలోని గంగారాం గ్రామానికి చెందిన తాటిపాముల స్వరూప అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఆదుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబుకు బాధితుని కుటుంబ సభ్యులు విన్నవించగా స్పందించిన మంత్రి రూ.2.50లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. సోమవారం మంత్రి సహాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఇందుకు మంత్రి దుద్దిళ్లకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నవతెలంగాణ-చిట్యాల

ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. మండలంలోని జడల్‌పేట ఎక్స్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ లోడ్‌తో వెళుతుండగా ఆపి అనుమతి పత్రాలను పరిశీలించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్టు తేలింది. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీన పరుచుకొని డ్రైవర్ చిరంజీవి, ఓనర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.